www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 19 డిసెంబర్ 2023

## వెలుగు వృద్ధాశ్రమానికి దుప్పట్లు వితరణ

ప్రజాశక్తి-మదనపల్లి

మండలంలోని కోళ్ళ బైలు పంచాయతీ అమ్మచెరువుమిట్ట వద్దనున్న వెలుగు వృద్ధాశ్రమంలో దుప్పట్లు వితరణ కార్యక్రమం నిర్వహించినట్లు సెక్రటరీ ఉదయ్ మోహన్‌రెడ్డి తెలిపారు. స్వర్గీయ మార్పురి వెంకట స్వామి నాయుడు 18వ వర్ధంతి సందర్భంగా వారి మనవరాలు ఇందిరా, కుటుంబ సభ్యులు కలసి వెలుగు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణి చేసారు. ఈ సందర్భంగా ఇందిరా మాట్లాడుతూ వెలుగు సంస్థ యొక్క సేవలను కొనియాడారు. తన వంతుగా ఈ చలికాలంలో వృద్ధులకు ఉపయోగకరంగా ఉంటాయని దుప్పట్లు అందజేశామన్నారు. అనంతరం వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి, వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, వెలుగు సిబ్బంది పాల్గొని వితరణ కార్యక్రమం మన వెలుగు సంస్థలో జరిపినందుకు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఇందిర

# అంగన్వాడీల్లో తగ్గని ఆగ్రహం

- ఆర్‌డిఒ కార్యాలయాల ముట్టడి, ర్యాలీ, మానవహారం
- ఏడో రోజూ కొనసాగిన నిరసనలు
- పార్టీలు, ప్రజల నుంచి పెరుగుతున్న మద్దతు

**తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి ఏడో రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఆయా కార్యాలయాల ఎదుట బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా వ్యాప్తంగా మానవహారాలు నిర్వహించారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది. ఆర్‌డిఒలకు వినతిపత్రాలు సమర్పించారు.**

రాయచోటి : ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.భాగ్య లక్ష్మి, ఐఎఫ్‌టియు నాయకులు మస్రూన్ బీ అన్నారు. సోమవారం ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో 7 వ రోజు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించాచు. సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు రూ. 26 వేలకు పెంచాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ. 5 లక్షలివ్వాలని, గ్రాట్యూటి అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అమలుచేయాలని తెలంగాణ కన్నా అదనంగా వెయ్యి రూపాయల వేతనం ఇస్తాననే హామి నిలబెట్టుకోవాలన్నారు. ఎఐటియుసి జిల్లాప్రధాన కార్యదర్శి సాంబశివ, కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మన్సూర్ మాట్లాడుతూ అంగన్వాడీ పోరాటాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. ఓబులమ్మ, ఎ.వి. రమణ, ఎస్. ఫయాజి, మాధవయ్య, కోశాధికారి బంగారుపాప, సుకుమారి, ఖాజాబి, సిద్దమ్మ, నాగమణి, అరుణ, ప్రభావతి, నాగరాజమ్మ, లక్ష్మిదేవమ్మ , కవిత ,శంకరమ్మ ఉమా జయమ్మ రమణమ్మ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** అంగన్వాడీలు చేపడుతున్న రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ర్యాలీ నిర్వహించి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు కార్యాలయాన్ని ముట్టడి చేశారు. మొదట ఆర్‌డిఒ కార్యాలయం నుంచి ఫ్లైఓవర్ మీదుగా ర్యాలీ చేపట్టి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సి.నరసింహులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు మహేష్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎంఎస్.రాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఉపాధ్యక్షులు రమణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పందికాళ్ళ మణి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పెంచలయ్య కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలను రోడ్ల మీదకు లాగిన పాపం ప్రభుత్వాన్ని కట్టి కుడుపేస్తుందని, తమ డిమాండ్లు నెరవేర్చే వరకు ఎంతకాలమైనా పోరాటం కొనసాగిస్తామని, రానున్న ఎన్నికలలో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి శివరామకృష్ణ దేవరా, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి సికిందర్, రాజంపేట, రైల్వేకోడూరు, చిట్వేలి ప్రాజెక్టుల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **మదనపల్లి:** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం నుంచి ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు వచ్చి అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మధురవాణి మాట్లాడుతూ ఏడు రోజులుగా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఆర్‌డిఒ ఎం.ఎస్.మురళికి వినతిపత్రాన్ని అందించి తమ సమస్యలపై ప్రభుత్వానికి తెలపాలని విన్నవించామన్నారు. కార్యక్రమంలో గౌరీ, కరుణ, స్వారూపా, భూకైలేశ్వరి, అమ్మాజీ, విజయ, అఖిరున్నిసా, బాగ్యా, గీతా సుజాని, శ్రీవాణి, ఈశ్వరి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజంపేట : ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

మదనపల్లె : ఆర్‌డిఒ మురళికి వినతిపత్రం అందిస్తున్న అంగన్వాడీలు

# పేదలకు వరం 'ఆరోగ్యశ్రీ' : కలెక్టర్

లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న కలెక్టర్ గిరీష, జకియాఖానం

ప్రజాశక్తి - రాయచోటి

కొత్త ఫీచర్లతో కూడిన స్మార్ట్ ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు.డాక్టర్ వైఎస ఆర్ ఆరోగ్యశ్రీకి మరిన్ని మెరుగులు దిద్దుతూ అందజేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం గురించి ప్రతి ఇంటికీ వెళ్లి అవగాహన కల్పించే కార్యక్రమానికి సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి రాయచోటి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ గిరీష, శాసనమండలి ఉపాధ్యక్షులు జకియా ఖానం, మదనపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ నవాజ్‌బాష, ఎస్పి బి. కృష్ణా రావు, మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్‌బాష, వైస్ ఛైర్మన్ ఫయాజుర్ రహమాన్, జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్, డిఎంహెచ్ఒ డాక్టర్ కె.కొండయ్య, డిసిహెచ్ఎస్ డేవిడ్ సుకుమార్ హాజరయ్యారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కింద 1059 వ్యాధులకు మాత్రమే ఉన్న పరిధిని 3257 వ్యాధులకు ప్రభుత్వం విస్తరిం చిందని పేర్కొన్నారు. పేద మధ్య తరగతి ప్రజలకు మెరుగైన ఉచిత కార్పొరేట్ వైద్యం అందించే దిశగా డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీకి మరింత జీవం పోస్తూ రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందేలా ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని చెప్పారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించి 4,61,553 అర్హులైన కుటుంబాలకు 2,91,245 కొత్త ఫీచర్లతో కూడిన ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీష మాట్లాడుతూ కార్యక్రమ అమలుపై ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్యశ్రీపై మరింత అవగాహన కల్పించాలన్నారు. లబ్ధిదారులకు దిక్సూచి ఇలా పనిచేసే ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరి సెల్ ఫోన్ లో డౌన్లోడ్ చేయించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమం విజయవంతం కావడంతో జనవరి 1 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కూడా ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శాసనమండలి ఉపాధ్యక్షురాలు జకియా ఖానం మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్య-వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ వైద్యాన్ని పేద ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు అన్నారు. మదనపల్లె ఎమ్మెల్యే మహమ్మద్ నవాజ్‌బాష మాట్లాడుతూ ఇక నుంచి డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కింద పరిధిని విస్తరిస్తూ రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించాలని చెప్పారు. దేశంలో, ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ రాష్ట్ర చరిత్రలో చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్, శాసనమండలి ఉపాధ్యక్షురాలు, మదనపల్లి ఎమ్మెల్యే, ఎస్పి, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ల చేతుల మీదుగా లబ్ధిదారులకు కొత్త ఫీచర్లతో కూడిన ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యశాఖ అధికారులు, సిబ్బంది, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

**శాసన మండలి మాజీ ఛైర్మన్ షరీఫ్**

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్రంలో విద్యా ఉపాధి లేకుండా పోయిందని రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీనితోనే సాధ్యమని శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పట్టణంలోని నారాయణ కళ్యాణ మండపంలో నియోజకవర్గ శాసనసభ నియోజకవర్గ ముస్లింల ఆత్మీయ సదస్సును మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు పేదరికం నిర్మూలించాలనీ స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. ఆయన అడుగుజాడల్లో నారా చంద్రబాబు నాయుడు పార్టీ నడిపిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మైనార్టీల పైన దాడులు పెరిగి పోయాయన్నారు. వైసిపి ప్రభుత్వం పైన తీవ్ర వ్యక్తులకు ఉన్నారన్నారు పరిస్థితి రాష్ట్ర ఆనందపు రాష్ట్రానికి పరిశ్రమలు పోలవరం రాజధాని పూర్తి కావాలంటే చంద్రబాబునాయుడును తిరిగి ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. టిడిపి జనసేన పార్టీలు పొత్తు వల్ల టిడిపి అధికారంలోకి రావడం తధ్యమన్నారు. మాజీ మంత్రి రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగువాసి పాలకొండ రాయుడు అనేక సేవలు చేశారని వారు అడుగుజాడల్లో బాలసుబ్రమణ్యం, రమేష్ కుమార్‌రెడ్డి నడుస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో వారిద్దరిని గెలిపించాలన్నారు. రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి సుగువాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ వైసిపి రాయచోటిలో గెలిచిందంటే మైనార్టీల బిక్ష అని పేర్కొన్నారు. రాయచోటలో మైనార్టీల కోసం వైసిపి నాయకులు మాయమాటలు చెప్పి మైనార్టీలు నటించడం ముంచారని పేర్కొన్నారు. రాబోయే రోజులలో తెలుగుదేశం పార్టీ విద్యానికే కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం రాష్ట్రంలోని రాయచోటి నియోజకవర్గం మొదటి స్థానంలో ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తిరిగి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. టిటిడి బోర్డు మాజీ సభ్యులు సుగువాస ప్రసాద్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు బలహీన మైనార్టీల పైన దాడులు ఎక్కువ అయ్యాయని పేర్కొన్నారు రాబోయే ఎన్నికల్లో అందరం కలిసి ఐక్యంగా వైసిపి ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు అమీర్ బాబు, టిడిపి రాష్ట్ర నాయకులు పర్వీన్‌తాజ్, టిడిపి పట్టణ, రూరల్ అధ్యక్షులు ఖాదర్ వలీ, మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, వతన్ నిస్సార్, పలువురు మైనార్టీలు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న షరీఫ్

హద్దులు దాటి నిర్మించిన రేకుల షెడ్డు

## నగర పంచాయతీ స్థలం కబ్జా

**- పట్టని టౌన్ ప్లానింగ్ సిబ్బంది**

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ కార్యాలయం నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ఉన్న రోడ్డులో ఆక్రమణదారులు హద్దులుకు మించి రోడ్డు ఇరువైపులా ఆక్రమించుకుంటూ వస్తున్నారు. ఆక్రమించుకున్న వారికి ఆక్రమించుకున్నంతా చందంగా మారింది పరిస్థితి. నగర పంచాయతీ టౌన్ ప్లానింగ్ వారు చోద్యం చూస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోజు విధులకు వచ్చామా రోజంతా పరిశీలించామా వెళ్లిపోయావా అన్నట్లు విధులు నిర్వహిస్తున్నారు తప్ప ఆక్రమణలకు గురవుతున్న మెయిన్ రోడ్డును కూడా చూసిచూడనట్లు వ్యవహరించడం ఏమిటని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు మెయిన్ రోడ్డును పరిశీలించి హద్దులు ఉన్న విధంగా ఇంటి యజమానులకు షాపు యజమానులకు తెలిపి ఆక్రమణకు గురైన వాటిని తొలగించాలని పలువురు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఆయుర్వేద వైద్యంపై అవగాహన

ప్రజాశక్తి-పీలేరు

మోకాళ్ల అరుగుదలకు ఆపరేషన్ అవసరం లేకుండా ఆయుర్వేద పంచకర్మ చికిత్సల ద్వారా నయం అవుతాయని డాక్టర్ పూర్ణ రాజేశ్వరి తెలిపారు. సోమవారం పట్టణంలోని షీ యోగా కేంద్రంలో విజయవాడకు చెందిన సురక్ష ఆయుర్వేద సంస్థ ఆధ్వర్యంలో ఆయుర్వేదంపై ఉచిత అవగాహన సదస్సు, మోకాళ్ళ నొప్పులకు చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు షీ సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ పివిఎస్ లక్ష్మి తెలియజేశారు. ఈ శిబిరంలో 30 మందికి పైగా హాజరై మోకాళ్ళ నొప్పులు ఎందుకు వస్తున్నాయి, అధిక బరువుకు కారణాలు ఏంటి, ఎలా నివారించుకోవాలి,హార్మోనల్ సమస్యలను ఆయుర్వేద పంచకర్మ చికిత్సలతో ఎలా తగ్గించుకోవాలి, ముఖ్యంగా మోకాళ్ళ నొప్పులు సులభంగా తగ్గేదెలా అనే అంశంపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. కొన్ని ప్రాణాయామాలు, ఆసనాలు వేయడం ద్వారా కూడా కచ్చితంగా మోకాలు అరుగుదల జరగకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. పీలేరు పరిసర ప్రాంతాల ప్రజలు షీ దివ్య యోగా విద్యాలయంలో ప్రతినెలా జరిగే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ పూర్ణ

# కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజనబోయిన శ్రీకాంత్ నియమితులయ్యారు. సోమవారం డిసిసి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు షేక్ అల్లా బకాష్ చేతులు మీదుగా శ్రీకాంత్ నియామమక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసేవారిని పార్టీ ఎల్లవేళలా గుర్తించి తగిన గుర్తింపునిస్తుంన్నారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా తన వంతు పని చేస్తానన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షులు షేక్‌అల్లా బకాష్, స్టేట్ మహిళా నాయకులు లీలా శ్రీనివాస్, స్టేట్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, స్టేట్ మీడియా ప్రచార సారధి డాక్టర్ తులసి రెడ్డి, పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేసారు.

**జిల్లా కార్యదర్శిగా బషీర్ అహ్మద్ బేగ్**

**రాయచోటి:** కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా పట్టణానికి చెందిన బషీర్ అహ్మద్ బేగ్ నియమిస్తూ సోమవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ బలోపేతంతో పాటు కాంగ్రెస్ పార్టీలో చురుకుగా సేవలందిస్తున్న బషీర్ అహ్మద్ బేగ్ సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం అన్నమయ్య జిల్లా కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ తులసి రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, రాష్ట్ర మైనార్టీ విభాగం వైస్ ఛైర్మన్ కొత్వాల్ మహమ్మద్ రఫీ, డిసిసి అధ్యక్షులు షేక్ అల్లాబకష్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు రాయచోటి చెన్న కృష్ణ, డిసిసి ఉపాధ్యక్షులు దర్బార్‌బాషా, రాయచోటి పట్టణం మాజీ అధ్యక్షులు ఫారూక్ ఖాన్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకమంతో ఇచ్చిన పదవికి ఎటువంటి విమర్శలు లేకుండా భవిష్యత్తులో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు.

రైల్వేకోడూరు : నియామక పత్రం అందుకుంటున్న శ్రీకాంత్

# ఆరోగ్యవరం మాజీ డైరెక్టర్ వెస్లీ మృతి

**పలువురు ప్రముఖులు సంతాపం**
**ముగిసిన అంత్యక్రియలు**

ప్రజాశక్తి-మదనపల్లె

ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ వెస్లీ ఆదివారం రాత్రి క్రిస్మస్ వేడుకలలో పాల్గొని ప్రసంగించిన అనంతరం కూర్చిలో కూర్చొని కుప్పకూలడంతో హుటాహుటిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించడంతో అప్పటికే ఆయన గుండెపోటుతో మృతి చెందినట్లు డాక్టర్ దృవీకరించారని కుటుంబీకులు తెలిపారు. సోమవారం ఆయన భౌతికకాయానికి పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేశారు. మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.రవికుమార్, అనంతపురం జిల్లా వైద్యాధికారి పాల్ రవికుమార్, రాయలసీయ డయాసిస్ బిసప్ వరప్రసాద్, ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర, మాజీ ఎంపిపి జికె వెంకటరమణ, సర్పంచ్ ఈశ్వరయ్య, పట్టణంలోపి పలువురు వైద్యులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళ్ళులు అర్పించి వారి కుటుంబానికి సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం కన్నీటి వీడ్కోలుతో ఆరోగ్యవరం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన వేలాది మంది పేదప్రజలను క్షయవ్యాధి నుండి కాపాడి ప్రాణ భిక్ష పెట్టారు. ఆయన కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురానికి చెందిన దొరస్వామి, కనకమ్మ దంపతుల 11వ సంతానం ఈయన 10వ తరగతి వరకు సింహాద్రిపురంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, ఇంటర్ పులివెందులలో, బిఎస్సీ కడప డిగ్రీ కళాశాలలో అభ్యశించారు. అనంతరం తమిళనాడు రాష్ట్రంలోని వేలూరు సిఎంసి మెడికల్ కళాశాలలో వైద్య విద్యను అభ్యశించారు. మొదట మదనపల్లె ఎంఎల్ఎల్ అసుపత్రి, జమ్మలమడుగులోని క్యాంబెల్ ఆసుపత్రిలలో డైరెక్టర్‌గా పని చేసి ప్రజలకు సేవలు అందించారు. 1990లో మదనపల్లె ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌లో డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి ఎంతో మంది దక్షణ భారతదేశంలో వివిధ రాష్ట్ర నుండి వచ్చి క్షయ వ్యాధిగ్రస్థులను వైద్యాన్ని ప్రాణబిక్ష పెట్టారు. అంతే కాకుండా ఆరోగ్యవరం నందు మెడికల్ కళాశాలను స్థాపించేందు కోసం మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఎంతోగానో పోరాటం చేశారు. కొన్ని రాజకీయ కారణాల దృష్ట్యా మెడికల్ కళాశాలను తీసుకురావడానికి సఫలీకృతం కాలేకపోయారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. 2023లో రాయలసీమ డైయాసీస్‌లో నెలకొన్న రాజకీయ కారణాలతో డైరెక్టర్ పదవి నుండి బలవంతంగా బిషప్ వరప్రసాద్ తొలగించారు. అనంతరం పేదలకు తిరిగి వైద్యం అందించాడానికి సిటియం క్రాస్ నందు వైద్య సేవలు పున:రుద్ధరించారు. ఈయన మృతితో ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ మరియు గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆయన 33 సంవత్సరాలుగా ప్రజలకు అందించిన వైద్యసేవలు గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమైయ్యారు.

మాజీ డైరెక్టర్ వెస్లీ (ఫైల్ ఫొటో)

కోర్టు బయట నిరసన వ్యక్తం చేస్తున్న అఖిలపక్ష నాయకులు

## కోర్టుకు హాజరైన అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేయాలని చేపట్టిన నిరసనలో భాగంగా సోమవారం అఖిలపక్ష నాయకులు కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి మాట్లాడుతూ ఎంతో చారిత్రాత్మక నైపుణ్యం ఉన్న మదనపల్లిని జిల్లాగా చేయాలని అఖిలపక్షంతో కలిసి చేసిన ఆందోళనలను ఈ ప్రభుత్వం నిరుపయోగం చేసిందని పేర్కొన్నారు. కనీసం చర్చలకు కూడా పిలవకుండా ఎకపక్షంగా వ్యవహరించిందని చెప్పారు. మదనపల్లి, వాయల్పాడు, తంబాళపల్లి, పీలేరు, పుంగనూరు నియోజకవర్గ ప్రజలు రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వంకి తగిన బుద్ధి చెప్పాలని నిర్ణయించుకొన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన 27 యాక్ట్‌ని రద్దు చేయాలని సివిల్ కోర్టులో ఉంటే ప్రజలకు న్యాయం చేకూరుతుందని సివిల్ కోర్టు నుండి తీసివేసి రెవెన్యూ అధికారులకు పట్టం కట్టారని తెలిపారు. రెవెన్యూ అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిడులకు లోనవుతుంది కాబట్టి ఆ యాక్ట్ వెంటనే రద్దు చేసి ప్రజలకు, న్యాయవాదులకి న్యాయం చేయాలని అఖిలపక్షం తరుపున డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్జె వెంకటేష్, పిఇఎం శివప్రసాద్, టిడిపి రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు సురేంద్ర యాదవ్, టిడిపి రైతు ప్రధాన కార్యదర్శి రాటకొండ మధుబాబు, సిపిఐ నాయకులు కృష్ణప్ప, మురళి పాల్గొన్నారు.

## భవిత కేంద్రం చిన్నారులకు భోజన వసతి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

స్థానిక భవిత కేంద్రంలోని విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు పట్టణంలోని పి.వి.కృష్ణమూర్తి జయంతి సందర్భంగా యువకులు జనార్దన్, రాజా, చాంద్‌బాషాలు సోమవారం భోజనాలు ఏర్పాటు చేశారు. భవిత కేంద్రంలో చిన్నారులకు భోజనం వసతి ఏర్పాటు చేసి, వారితో గడపడం ఆనందంగా ఉందన్నారు. దివ్యాంగుల పట్ల వివక్ష చూపకుండా వారిని ప్రేమతో ఆదరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

## ములకలచెరువు ఎంపిడిఒగా పోలప్ప

ప్రజాశక్తి-ములకలచెరువు

మండల పరిషత్ అధికారిగా పోలప్ప సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మండలంలోని ప్రజలు సమస్యలపై మండల పరిషత్ కార్యాలయానికి వస్తే ఆ సమస్యలు పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటానని సూచించారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి

## విద్యతో పాటు ఉపాధి కల్పనే లక్ష్యం : ప్రిన్సిపల్

ప్రజాశక్తి-పీలేరు

తమ కళాశాల విద్యార్థులకు విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యమని పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో సదర్ ల్యాండ్ గ్లోబల్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలో పది మంది విద్యార్థులు రూ.3.5 లక్షల వార్షిక వేతనంపై ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. తిరుపతికి చెందిన సత్య ఇన్ఫోటెక్ సత్య ఇన్ఫోటెక్ ఎండి గిరీష్ కుమార్‌ను అభినందించారు. కళాశాల విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, ఇంటర్న్ షిప్ ఏర్పాటు, ఉద్యోగ కల్పన అంశాలకు సంబంధించి సత్య ఇన్ఫోటెక్ కంపెనీతో కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. ఈ సందర్భంగా ఒప్పంద పత్రాలను కళాశాల ప్రిన్సిపల్, సత్య ఇన్ఫోటెక్ ఎండి గిరీష్ కుమార్ పరస్పరం అందజేసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కవిత, శ్రీనివాసులురెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి -కలకడ

మెగా ఆరోగ్యశ్రీ ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చెప్పిన విషయాలను ప్రతి ఒక్క వాలంటీర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఎఎన్ఎంలు ఆశ వర్కర్స్, ప్రజాప్రతినిధులు కలిసి ఇంటికి వెళ్లి ఆరోగ్యశ్రీ కార్డులను డౌన్లోడ్ చేయించాలని పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ -2 కింద జనవరి నుంచి మొదలు పెట్టడం జరుగుతుందని ప్రతి ఆరు నెలలకొకసారి ఈ కార్యక్రమం ను నిర్వహించి ఉచితంగా రక్త పరీక్షలు, మందులు, కంటి పరీక్షలు స్పెషలిస్ట్ డాక్టర్ పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, తహశీల్దార్ ప్రదీప్, మెడికల్ ఆఫీసర్స్ మల్లికార్జున, జవహర్ బాబు, మోహన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. బి.కొత్తకోట : మెగా ఆరోగ్యశ్రీపై అవగాహన కార్యక్రమాన్ని సిఎం క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ పి.మనోహర్, తహశీల్దార్ రఫీక్ అహ్మద్ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఆరోగ్యశ్రీ ద్వారా అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్యశ్రీ పెంచిన నగదు వివరాలను వెల్లడించడం జరిగిందన్నారు.ఆదేవిధంగా మండల పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రిలలో ప్రజలకు ఆరోగ్యశ్రీ సేవల అందించాల్సిన తీరుపై పలు సూచనలు,సలహాలు ఇచ్చారన్నారు.దాని ప్రకారం బి.కొత్తకోట మండలంలో మెగా ఆరోగ్యశ్రీ సేవలను ప్రజలకు అందిస్తామని వారు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పటల్ డాక్టర్ ఆరిఫ్ పాల్గొన్నారు.

జనసేనలో చేరినవారితో శ్రీనివాసరాజు

## పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు అన్నారు. సోమవారం పలువురు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వివిధ ప్రాంతాలలోని ప్రజలు జనసేన పార్టీకి మద్దతుగా నిలబడినందుకు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామన్నారు. పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని, కష్టపడ్డ ప్రతి ఒక్కరికి పార్టీలో తగిన స్థానం కల్పిస్తామని తెలిపారు. టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి రాగానే స్థానిక సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో కాపు వైసిపి నాయకులు ఆకుల చలపతి, బలిజ నాయకులు భీమినేని రమేష్, గాజుల చిన్న కులాయప్ప, కుప్పాల మల్లికార్జున, షేక్ దర్బార్, షేక్ జావీద్‌బాషా నూర్‌బాషా, మౌలా, పఠాన్, చీమకుర్తి శివుడు రుద్రరాజు లక్ష్మీకర్, ముమ్మడి రాజు, శివశంకర్ రాజు, సాయి రాజు ఉన్నారు. పవన్ కల్యాణ్ ఆశయాలు, జనసేన సిద్ధాంతాలు తమను ఆకర్షించాయని ఈ సందర్భంగా పార్టీలో చేరినవారు పేర్కొన్నారు.

## అసాంఘిక శక్తులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -నందలూరు

ఎన్నికల ముందు దుష్ప్రచారాలు చేస్తూ అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు కార్యకర్తల మధ్య చిచ్చుపెట్టేలా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా వక్ఫ్ బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల కో-ఆప్షన్ సభ్యులు కరిముల్లా ఖాన్ సోమవారం ఎస్ఐ అబ్దుల్ జహీర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మీరు మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడా మల్లి కార్జునరెడ్డి, ఎంఆర్ కె.ఆర్.కన్స్ట్రక్షన్ అధినేత మేడా రఘునాథ్‌రెడ్డి టిడిపిలో చేరుతున్నట్లు కొన్ని వాట్సప్ గ్రూపుల ద్వారా టంగుటూరుకు చెందిన గుజ్జల ఈశ్వరయ్య దుష్ప్రచారం చేయడంతో అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మల్లికార్జున్‌రెడ్డి రాజంపేట డిఎస్‌పికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల సమయంలో పార్టీల మధ్య చిచ్చుపెట్టేలా ఎవరైనా అసాంఘిక సంఘటనకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జహీర్ తెలిపారు. కార్యక్రమంలో టంగుటూరు సర్పంచ్ మైనుద్దీన్, మన్సూర్ అలీఖాన్ పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఆవు మృతి

ప్రజాశక్తి-గాలివీడు

పంచాయతీ సచివాలయం-2 పరిధిలోని కావలిపల్లిలో ట్రాన్స్ ఫార్మర్ వైర్లు తగిలి సోమవారం ఆవు మృతి చెందింది. కొచ్చేరువు అన్నారెడ్డి అనే రైతు నెల కిందట బ్యాంకులో తన భార్య నగలను తాకట్టుపెట్టి రూ.లక్ష ఆవును కొనుగోలు చేశారు. మేతకు వెళ్లిన ఆవు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఆవు మృతితో రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ట్రాన్స్కో అధికారుల నిర్లక్ష్యం వల్ల చేతికి అందే అంత ఎత్తులోనే ట్రాన్స్‌ఫార్మర్ అమర్చడం వల్ల గతంలో కూడా ఒక మేకపోతు, ఆవు కూడా మృతి చెందింది. ఆవు మృతి చెందడానికి కూడా ట్రాన్స్కో అధికారుల నిర్లక్ష్యమేనని రైతు వాపోయారు. కుటుంబాన్ని పోషించుకోవడానికి ఎటువంటి ఆధారం లేకుండా ఆవును తెచ్చుకొని మేపుకుంటున్నానని రైతు తెలిపారు. నెలలోపు ఈతకు రానుందన్నారు. ప్రభుత్వం తమ కుటుంబానికి న్యాయం చేయాలని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన ఆవు

# జగన్ పాలన మైనార్టీలకు స్వర్ణయుగం

### - రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

ఉర్దూ అకాడమీ శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డైరెక్టర్ అబ్దుల్ కలీం

ప్రజాశక్తి-కలికిరి

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పరిపాలన ముస్లిం మైనార్టీలకు స్వర్ణయుగమని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక ఉర్దూ అకాడమీ కంప్యూటర్ శిక్షణ కేంద్రం, గ్రంథాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని ఒక విధానంగా అమలు చేస్తున్నది వైసీపీ ప్రభుత్వమేనని, గత తెలుగుదేశం పాలనలో సామాజిక న్యాయం మాటలకే పరిమితమైందన్నారు. టిడిపి పాలనలో మైనార్టీ మంత్రి లేకుండా నాలుగున్నరేళ్లపాటు ప్రభుత్వాన్ని నడపగా, సిఎం జగన్మోహన్‌రెడ్డి తొలి క్యాబినెట్‌లోనే మైనారిటీలకు అత్యున్నతమైన ఉప ముఖ్యమంత్రి పదవిని ఇచ్చారని, శాసనమండలిలో డిప్యూటీ ఛైర్‌పర్సన్ పదవిని ఇచ్చారన్నారు. నలుగురిని ఎమ్మెల్యేలుగా, మరో నలుగురిని ఎమ్మెల్సీలుగా చేయడమే కాకుండా, 13 రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులను మైనారిటీలకు ఇచ్చారని, మసీదుల మౌజన్లు, ఇమామ్‌ల వేతనాలను పెంచారని పేర్కొన్నారు. ఉర్దూ భాషను రాష్ట్రవ్యాప్తంగా ద్వితీయ అధికార భాషగా అమలు చేసిన ఘనత కూడా సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఛైర్మన్లు, ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల డైరెక్టర్ల పదవులు తదితర రాజకీయ పదవుల్లో సముచిత స్థానాన్ని కల్పించి మైనారిటీలను గుండెలో పెట్టుకున్న నేత సిఎం జగన్మోహన్‌రెడ్డని పేర్కొన్నారు. రాజంపేట పార్లమెంటు నియోజకవర్గంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ముస్లిం మైనారిటీలను తమ కుటుంబ సభ్యులతో సమానంగా ఆదరిస్తున్నారని, మసీదులు, దర్గాలు, పీర్లచావిళ్లు, కబరస్థానల్లో అభివృద్ధి పనులకు ఎంపీ నిధులను కేటాయించి ముస్లిం మైనారిటీల సామాజిక అభివృద్ధికి అమితంగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలతో ముస్లిం మైనార్టీలకు ఎంతో ప్రయోజనం చేకూర్తోందని, పీలేరు నియోజకవర్గంలోనే రూ. వంద కోట్లకు పైగా ముస్లింలకు నవరత్నాలతో ప్రయోజనం చేకూరిందన్నారు. పవిత్ర హజ్ యాత్ర చేసే ముస్లింలకు కేంద్ర ప్రభుత్వం రాయితీని రద్దు చేసినప్పటికీ, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ప్రత్యేక చొరవతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మక్కా యాత్రికుడికి రూ.80 వేల మేరకు ఆర్థిక భారాన్ని భరిస్తున్నట్లు తెలిపారు. ముస్లిం మైనారిటీలకు సముచిత గౌరవాన్ని కల్పిస్తూ అన్ని విధాల ఆదరిస్తున్నది సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమేనని, దుల్హన్, విదేశీ విద్యా పథకాలను 2018లోనే అప్పటి సిఎం చంద్రబాబు నాయుడు నిలిపివేయడం జరిగిందన్నారు. అయితే జగన్మోహన్ రెడ్డి ఈ పథకాలను మళ్లీ పునః ప్రారంభించారని, దుల్హన్ పథకాన్ని 'షాదీ ముబారక్' గా పేరు మార్చి ఆర్థిక సహాయాన్ని రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచడం జరిగిందన్నారు. ముస్లిం మైనారిటీలు వైసీపీని ఆదరిస్తూ, సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలకు అండగా నిలుస్తారన్నారు. టిడిపి మోసాలను, మాయ మాటలను ముస్లింలు ఎప్పటికీ నమ్మరని తెలిపారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి : ఎంపిపి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి నరసింహులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, పలు రకాల ఇన్సూరెన్స్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి నరసింహులు అన్నారు. సోమవారం బండ్లపై, రెడ్డివారిపల్లి పంచాయతీలలో సర్పంచ్‌లు వెంకటరత్న, నూతనకాల్వ రెడ్డమ్మ నరేంద్రరెడ్డి అధ్యక్షతన ప్రభుత్వ అధికారులు నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సింగల్ విండో అధ్యక్షులు రెడ్డి శేఖర్‌రెడ్డి, బిజెపి నాయకులు భాస్కర్ రెడ్డి, ఎంపిడిఒ శేషగిరిరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు, ఎంఇఒ నారాయణలతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ప్రచార వాహనానికి ఎంపిపి, స్థానిక సర్పంచ్ అధికారులతో కలిసి జండా ఊపి స్వాగతం పలికారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఎల్ఇడి స్క్రీన్పై ప్రదర్శించారు. అనంతరం స్థానిక పాఠశాలలోని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న 17 రకాల పథకాలను, వాటి ఉపయోగాలను ఆయా శాఖల అధికారులు ప్రజలకు, లబ్ధిదారులకు వివరించారు. పథకాల ద్వారా ప్రయోజనం పొందిన లబ్ధిదారుల చేత వాటి ఉపయోగాలను ప్రజలకు వివరించారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్ ద్వారా ఉచితంగా గ్యాస్ లను కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నాదన్నారు. రైతులకు పీఎం కిసాన్, కిసాన్ క్రెడిట్ కార్డు, నానో యూరియా వంటి వాటిని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. పంచాయతీల అభివృద్ధికి ప్రతి ఏటా ప్రత్యేక నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించి ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు గ్రామాల అభివృద్ధికి ప్రణాళికను రచిస్తూ నిధులను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకుల ద్వారా మహిళలకు, ప్రజలకు అనేక రకాలైన లోను సదుపాయాలు, ఇన్సూరెన్స్‌లు అందుబాటులో ఉన్నాయని వాటిని ఉపయోగించుకోవాలన్నారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఆరోగ్య శాఖలో ఆయుష్మాన్ కార్డును ప్రతి ఒక్కరికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నాదని, దీని ద్వారా దేశవ్యాప్తంగా ఏ ఆసుపత్రిలోనైనా ఐదు లక్షల వరకు వైద్య సేవలను పొందవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గురించి తెలుసుకొని, వాటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చంద్రమోహన్, శివశంకర్‌రెడ్డి, ఆర్‌బిఐ బ్యాంకు సిబ్బంది పూర్ణిమ, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ దివాకర్, ఈవోపీఆర్డి చలపతిరావు, ఏపీఎం రజనీకుమారి, ఎపిఒ రమేష్, ఎఇలు హరినాథ్ రెడ్డి, అమర్నాథ్, ఎఒ మురళీమోహన్, ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు మారప్ప, సరస్వతి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సరోగసితో పుంగనూరు జాతి కోడెదూడ జననం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో చింతల దీవి పశుక్షేత్రంలో తయారుచేసిన ఏడు రోజుల వయసున్న ఘనీకృత పుంగనూరు జాతి పిండాన్ని డాక్టర్ ప్రతాప్ శెట్టిగుంటలో హరి అనే రైతుకు చెందిన నాటు ఆవు గర్భంలో ఈ ఏడాది మార్చి 4వ తేదీన ఉచితంగా ప్రవేశ పెట్టడం జరిగింది. మే 25వ తేదీన డాక్టర్ అబ్దుల్ అరీఫ్ చూలు నిర్ధారణ చేశారు. తదుపరి ఆ పశువుకి రూ.2500 దాణా, ఖనిజ లవణాలను ఉచితంగా పంపిణీ చేశారు. డిసెంబర్ 17వ తేదీన ఆ పశువు రాత్రి 9:30 గంటలకు మేలు జాతి పుంగనూరు జాతి కోడెదూడకు జన్మనిచ్చింది. దూడ చాలా ఆరోగ్యంగా మంచి జాతి లక్షణాలతో ఉందని రైతు ఆనందాన్ని వ్యక్తపరిచి డాక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపి పిండ మార్పిడి విధానం ద్వారా మనకు కావలసిన పశువులని మనం తక్కువ ఖర్చుతో పొందవచ్చని తెలిపారు. డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న డాక్టర్లకి పిండ మార్పిడి విధానం మీద ప్రత్యేక అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని విజయ పథంలో తీసుకెళుతున్న సిఇఒ ఎపిఎల్‌డిఎ డాక్టర్ శ్రీనివాసరావు, ఉపసంచాలకులు డాక్టర్ అబ్దుల్ అరిఫ్ పిండోత్పత్తిలో భూమిక పోషించిన డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ గీతా పిండ మార్పిడిలో సహాయపడిన సాంబశివరావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య నిర్వహణ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలోనే ప్రప్రథమంగా ఘనీకృత పిండ మార్పిడి ద్వారా పుంగనూరు జాతి దూడ జననం మన రాష్ట్రానికే సాధ్యమైందని ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమం ద్వారా అత్యుత్తమ జాతి లక్షణాలు కలిగిన పశువుల, అంతరించిపోతున్న స్వదేశీ జాతుల యొక్క వృద్ధి అతి తక్కువ సమయంలోనే సాధ్యపడుతుందని తెలిపారు.

లేగదూడతో రైతు హరి

సమావేశంలో మాట్లాడతున్న ఇడి చెంగల్‌రెడ్డి

## ప్రతి ఊరికీ బస్సులు నడుపుతాం

### - ఆర్‌టిసి కడప జోన్ ఇడి చెంగల్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

ప్రజా రవాణా సంస్థ ఉద్యోగులు ప్రయాణికుల ఆదరణ పొందుతూ ఆర్టీసీ ఆదాయాభివృద్ధికి కృషి చేయాలని ఆర్టీసీ కడప జోన్ ఇడి చెంగల్ రెడ్డి తెలిపారు. సోమవారం ఇడి పీలేరు ఆర్టీసీ డిపో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్యారేజీలో ఉద్యోగులతో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ సమన్వయం, క్రమశిక్షణతో కలిసి పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్గో సేవలు ఆశాజనకంగా ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా అరుణాచలంకు ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 2085 బస్సులు నడపగా రూ.9.13 కోట్లు ఆదాయం లభించిందని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలోని 5 డిపోల నుంచి 179 బస్సులు నడపగా రూ.60 లక్షలు ఆదాయం సమకూరిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది భక్తులకు సౌకర్యంగా 300 బస్సు సర్వీసులను ఇప్పటివరకు నడపడం జరిగిందని చెప్పారు. ఆ సంఖ్యను ఈ సంవత్సరం 500కు పెంచాలని ఆదేశించారు. ఇతర తీర్థయాత్రలు, విజ్ఞాన యాత్రల కోసం కూడా ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేందుకు ప్రయత్నించాలని పేర్కొన్నారు. ప్రతి కండక్టరు, డ్రైవరు ఎపికె, కెఎంపిఎల్ సాధించాలని చెప్పారు. అంతర్రాష్ట్ర బస్సు సర్వీసుల ఒప్పందం త్వరలో కుదరనుందని, పీలేరు డిపో నుంచి పది బస్సు సర్వీసులను పీలేరు డిపో పరిధిలోని పలు కేంద్రాల నుంచి బెంగళూరుకు నడపనున్నట్లు తెలియజేశారు. రాష్ట్రానికి త్వరలో 500 కొత్త బస్సులు రానున్నాయని, ప్రతి డిపోకు ప్రాధాన్యతను బట్టి కేటాయించడం జరుగుతుందని తెలిపారు. రోడ్డు ఉండి బస్సులు నడవని మార్గాలను డిపో అధికారులు సర్వే చేయాలని, ఆ మార్గాల్లోనూ బస్సు సర్వీసులు నడపడానికి కృషి చేద్దామని చెప్పారు. అత్యధిక ఎపికె సాధించిన కండక్టర్లను ఈ సందర్భంగా ఇడి సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌టిసి ఆర్‌ఎం రాము, పీలేరు డిపో మేనేజర్ బండ్ల కుమార్, సిఐ రవణమ్మ, ప్రజా రవాణా సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో ఆర్థికాభివృద్ధి

### - ఐకెపి ఎపిఎం గంగాధర్

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

ప్రకృతి వ్యవసాయంలో తక్కువ భూమిలో ఎక్కువ రకాల పంటలతో సేంద్రియ వ్యవసాయం తో ఆర్థిక అభివృద్ధి సాధ్యమని ఐకెపి ఎపిఎం గంగాధర్ సూచించారు. సోమవారం తంబళ్లపల్లె మండలం పరసతోపు పంచాయతీ బాలకవారిపల్లిలో ఏర్పాటు చేసిన వ్యవసాయ క్షేత్రంలో ఐకెపి విఒ సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై క్షేత్రస్థాయి అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో 30 సెంట్ల పొలంలో 23 రకాల ముల్లంగి, ఉల్లి, క్యారెట్, కొత్తిమీర, పలు రకాల ఆకుకూరలు, కూరగాయలు పంటలను పరిశీలించారు. ఈ ప్రకృతి వ్యవసాయంలో భూసారం పెంచడానికి పోషక విలువలు కలిగిన సేంద్రియ ఎరువులు, పచ్చి రొట్టె ఎరువులు, ఆవు పేడ, ఆవు మూత్రంతో పిచికారి ద్రవాలతో పంటలు సాగు చేసే విధానాన్ని అధ్యయనం చేశారు. అనంతరం ఎపిఎం మాట్లాడుతూ మండలంలోని వివో సభ్యుల ద్వారా సన్న కారు రైతులు సైతం తక్కువ భూమిలో ఎక్కువ సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేసుకుని తద్వారా వచ్చిన దిగుబడిని మార్కెటింగ్ ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించాలని వివో సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో సిసిలు భవాని శంకర్, ఆదిలక్ష్మి, అంషీర బేగం, ఎంపిఎం తులసి, ప్రకృతి వ్యవసాయ సలహాదారులు రఘునాథ్, రాజు, సునీత, రెడ్డప్ప, నిజాం, సుగుణ, సిద్ధమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

కొత్తిమీర పంటను పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థులకు మోడల్ ప్రశ్న పత్రాలను పంపిణీ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

## విద్యార్థులకు మాదిరి ప్రశ్న పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-పీలేరు

2024 మార్చిలో జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మాదిరి ప్రశ్న పత్రాలను అందజేసినట్లు యుటిఎఫ్ జిల్లా నాయకులు శివారెడ్డి, అక్రమ్ బాష తెలిపారు. సోమవారం స్థానిక కోటపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో యుటిఎఫ్ పీలేరు డివిజన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించి వారు మాట్లాడుతూ ఉన్నత స్థాయి చదువులకు వెళ్లాలని కోరుకునే విద్యార్థులకు 10వ తరగతి మార్కులు చాలా కీలకమని చెప్పారు. కాబట్టి, విద్యార్థులు తమ విలువైన సమయాన్ని వృథా చేయకుండా, ఏకాగ్రతతో అధ్యయనం చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబు రెడ్డి, యుటిఎఫ్ నాయకులు విశ్వనాథ రెడ్డి, సురేష్ రెడ్డి, సుధాకర్, వేణుగోపాల్, మస్తాన్ పాల్గొన్నారు.

## వైసిపి బిసి సెల్ ప్రధాన కార్యదర్శిగా గుణ

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన పునగాని గుణ యాదవ్ వైసిపి అనుబంధ విభాగ కమిటీలలో బిసి కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా గుణ యాదవ్ మాట్లాడుతూ రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జున్‌రెడ్డి, ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి సహకారంతో జిల్లా స్థాయిలో పదవి బాధ్యతలను చేపట్టడం జరిగిందన్నారు. రాజకీయ రంగంలో మేడా కుటుంబం యువతను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని అందుకు నిదర్శనం తానే అని అన్నారు. విద్యార్థి దశ నుండి యువతతో మంచి సత్సంబంధాలు కలిగి ఉన్నాయని, రాజంపేట వైసిపి యువజన విభాగం అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నియోజకవర్గ నాయకులతో సన్నిహితంగా ఉంటూ యువతను విద్య, ఉద్యోగ, రాజకీయంగా తనతో పాటు ఎదిగేలా చాలా మందిని ప్రోత్సహించడం జరిగిందని పేర్కొన్నారు. అఖిలభారత యాదవ మహాసభ రాజంపేట ఉపాధ్యక్షుడిగా నియోజకవర్గ యాదవ సోదరులతో మంచి సత్సంబంధాలు కలిగి ఉండి వారి అభివృద్ధికి తోడ్పాటు అందించడం జరిగిందన్నారు. అన్నమయ్య యువశక్తి సేవ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా తన బాధ్యతలు మరింత పెరిగాయని బిసిల లందరినీ ఒక తాటిపై తీసుకువచ్చి వైసిపి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

## పోలీసుస్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి-నందలూరు

స్థానిక పోలీస్ స్టేషన్‌ను సోమవారం రాజంపేట డిఎస్‌పి విఎన్‌కె చైతన్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ముందుగా స్టేషన్‌లోని పరిసరాలను, ఖైదీల గదిని, సిసి కెమెరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు సవరించుకోవాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయాలన్నారు. పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రాజంపేట రూరల్ సిఐ మంజునాథరెడ్డి, స్థానిక ఎస్ఐ అబ్దుల్ జహీర్, పోలీసులు దర్బార్ భాష, శ్రీను, రామకృష్ణ, మేరీ, పాల్గొన్నారు.

## ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులుగా శివయ్య

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులుగా రాజంపేటకు చెందిన మందా శివయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సోమవారం రాయచోటిలోని ఎన్జీవో కార్యాలయంలో ఎంఎస్‌పి రాష్ట్ర అధికార ప్రతినిధి నరేంద్ర, జిల్లా ఇన్‌ఛార్జి రాజు, కడప జిల్లా ఇన్‌ఛార్జి శివయ్య, చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జి వెంబడి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఎంఎస్‌పి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జాతి కోసం తాను చేసిన సేవలను గుర్తించి మందా శివయ్యను జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంఎస్‌పి రాష్ట్ర అధికార ప్రతినిధి నరేంద్ర తెలియజేశారు. మందా శివయ్య మాట్లాడుతూ తనపై విశ్వాసంతో తనను జిల్లా అధ్యక్షులుగా నియమిస్తూ బాధ్యతలు అప్పగించినందుకు జాతి అభ్యున్నతి కోసం పాటుపడతానని తెలిపారు. ఈ అవకాశం రావడానికి కృషి చేసిన ప్రతిఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

## టిడిపి బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దు

### - ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

టిడిపి బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దని, అందరికీ మంచి చేసే సిఎం జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం పిటిఎం మండలంలో మళ్లీ జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా చెన్నకేశవ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి బూచిపల్లి, సంపతి కోటలో ఇంటింటి వెళ్లి సంక్షేమ పథకాల అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనునిత్యం ప్రజాశ్రేయస్సుకై పరితపిస్తూ, అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సిఎం జగనన్న దేనన్నారు. మినీ మేనిఫెస్టోతో ప్రజలను మోసం చేసేందుకు టిడిపి పన్నాగం పన్నుతోందన్నారు. చంద్రబాబు నాయుడుని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, మరోసారి వైసిపి ప్రభంజనం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మహమ్మద్, జెసిఎస్ మండల కన్వీనర్ డ్రిప్ రమణ, సర్పంచ్ శ్రీరామ్‌రెడ్డి, ఎంపిటిసి కిట్టన్న, వాటర్ షెడ్ ఛైర్మన్ రఘునాథ్ రెడ్డి, నాయకులు రామిరెడ్డి, శంకర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, కె.మధు రెడ్డి, కుంచె శ్రీనివాసులు, మధుకర్ రెడ్డి, మెకానిక్ చంద్ర, ఉత్తన్న, చలపతి, శ్రీనివాసులు, రామ్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, పల్లిగట్ల కిట్టన్న, అయూబ్ భాష పాల్గొన్నారు.

## నూతన ల్యాబ్‌ను ప్రారంభించిన ఎంపిపి, తహశీల్దార్

ప్రజాశక్తి- పుల్లంపేట

మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఎంపిపి ముద్దా బాబుల్ రెడ్డి, తహశీల్దార్ నరసింహ కుమార్ ఆధ్వర్యంలో వ్యాధుల నిర్ధారణకు సంబంధించి ఆధునాతన ల్యాబ్‌ను ప్రారంభించారు. వ్యాధి నిర్ధారణకు సంబంధించి అవసరమైన రేడియంట్స్‌ను నిల్వ ఉంచేందుకు అవసరమైన రిఫ్రిజిరేటర్‌ను స్థానిక ఎంపిపి ఆరోగ్య కేంద్రానికి వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి డాక్టర్ సానే శేఖర్ మాట్లాడుతూ అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రిఫ్రిజిరేటర్‌ను వితరణగా ఇచ్చిన స్థానిక ఎంపిపి బాబుల్‌రెడ్డికి ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహ కుమార్, డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ శ్రీనిజ, ఎంపిడిఒ రఘురాం, హెల్త్ ఆఫీసర్ రాజా, హరహరమ్మ, సూపర్వైజర్లు కుమారి, సుబ్బారెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసన్న కుమారి, బివి కృష్ణయ్య, స్థానిక వైద్య సిబ్బంది ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంపిపి, తహశీల్దార్